# బెస్టాఫ్ త్రీ

● డి. రాజారెడ్డి



దూరంగా నీళ్ళలో మెల్లగా మునిగి పోతున్న ఎర్రటి సూర్యబింబాన్ని చూస్తూ దీర్ఘంగా నిట్టూర్చాడు కెప్టెన్ రవితేజ. అప్పటికి సరిగ్గా నాలుగు రోజులయింది వాళ్ళు భూమి అనే దాన్ని చూసి.

ఎటు చూసినా నీళ్ళే. ఎటు వెళ్తున్నారో కూడా అంతుపట్టడం లేదు. నెల క్రితం 'ఎరౌండ్ ది వరల్డ్' ఎక్స్‌పెడిషన్ కని బయలుదేరిన వాళ్ళ షిప్ తుపాన్‌లో చిక్కుకుని ముక్కలయిపోయింది. సహచరులందరూ ఏమైపోయారో కూడా, తెలియని గందరగోళంలో, అందుబాటులోని లైఫ్ బోట్‌లో తనూ, తనతో పాటు వైస్- కెప్టెన్సు హరీష్ కుమార్, నితేష్‌రాం ప్రాణాలు దక్కించుకున్నారు.

ఆలోచనలు ముగించి పక్కకి తిరిగి చూశాడు రవితేజ. నితేష్‌రాం ఆఖరిగా మిగిలిన వాటర్‌బాగ్‌లోని నీళ్ళు తాగుతున్నాడు. తాగడం ముగించి వాటర్‌బాగ్ అక్కడ పెడ్తూ-

''తినడానికేమన్నా వుందా, చాలా ఆకలిగా వుంది'' అన్నాడు.

''సరిగ్గా అదే నేనూ అడగాలనుకుంటున్నాను. ఏదో ఒకటి కడుపులో పడకపోతే ఎక్కువసేపు బ్రతికేట్టు లేను'' అన్నాడు హరీష్‌కుమార్.

''ఇదిగో ఈ బ్రెడ్‌ముక్క వుంది. ఇది తప్ప మన దగ్గర ఇంకేమీ లేదు'' అక్కడే వున్న సంచిలోనుండి చిన్న రొట్టె ముక్కను తీసి చూపించాడు రవితేజ. ఇద్దరూ మౌనంగా దాని వైపు చూశారు. రొట్టె ముక్క చాలా చిన్నదిగా వుంది. నిజానికది ముగ్గురికి పంచడం అసాధ్యం అన్నట్టుగా వుంది.

అలా కొద్దిసేపు చూసి హరీష్‌కుమార్ వున్నట్టుండి ''ఒక పని చేద్దాం. ఎలాగూ ఇప్పుడు చీకటిపడిపోయింది కాబట్టి, తలా ఓ గ్లాస్ నీళ్ళు తాగి నిద్రపోదాం. మెలుకువ వచ్చిన తరువాత మన ముగ్గురిలో ఎవరికి అందమైన కల వస్తుందో అతనికి ఈ బ్రెడ్ ముక్క ఇచ్చేద్దాం. కనీసం అతడైనా ఇంకో రోజు బ్రతుకుతాడు. ఏమంటారు సార్ రవితేజగారూ'' అంటూ చెప్పడం ఆపాడు.

''సరే అలాగే చేద్దాం'' అంటూ వాటర్‌బాగ్ అందుకున్నాడు రవితేజ.

* * *

ముందుగా నిద్ర లేచాడు హరీష్‌కుమార్. ఆ భయంకరమైన నిశ్శబ్దంలో మిగిలిన ఇద్దరి ముఖాలు వెన్నెలలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. అంతకు ముందు తనకొచ్చిన కలను తలచుకుంటూ నిద్రపోతున్న వాళ్ళ వైపు అలా చూస్తుండిపోయాడు. కొద్ది సేపటిలో, ముందు నితేష్‌రాం, తరువాత రవితేజ ఒకటి రెండు నిమిషాల తేడాతో లేచి కూర్చున్నారు.

''ముగ్గురం నిద్ర లేచాం కాబట్టి, మెలుకువ వచ్చిన వరుస ప్రకారం, వాళ్ళ వాళ్ళ కలల గురించి చెప్పుకుందాం'' ఉపోద్ఘాతం ఏమీ లేకుండా డైరెక్టుగా సబ్జెక్ట్‌లోకి దిగిపోయాడు హరీష్‌కుమార్.

''సరే ముందు లేచింది మువ్వే కాబట్టి, కమాన్ స్టార్ట్'' అని లైఫ్ బోట్ అంచుకు చేరగిలబడ్డాడు రవితేజ.

''మనం ఇలా పోతూ వుంటే దూరంగా ఏదో స్టీమర్ తాలూకు వెలుగు కనిపించిందట. ప్రాణం లేచి వచ్చినట్లై, మనం ముగ్గురం వాళ్ళ దృష్టిని ఆకర్షించేందుకు ఎన్నెన్నో ప్రయత్నాలు చేశామట. ఆశ్చర్యంగా అది మన వైపే రావడం. ప్రాణాలు దక్కాయి అనుకుంటూ, షిప్‌లోకి పోగానే అది ఇండియాదే అని తెలిసిందట'' ఉత్సాహంగా ఇద్దరి ముఖాల్లోకి చూశాడు హరీష్‌కుమార్.

నితేష్‌రాం కళ్ళు మూసుకుని పరవశంగా తన కల గురించి చెప్పసాగాడు. ''నేను స్వర్గంలో వున్నానట. రంభ మత్తుగా మధువు అందిస్తుంటే, ఊర్వశి కమనీయంగా గానం చేస్తుంటే, తిలోత్తమ వీణ మీద మధుర స్వరాలు పలికిస్తుంటే, మేనక నవరసాలొలికిస్తూ నాట్యం చేస్తుంటే- అబ్బా అమర సౌఖ్యాలు అనుభవించానట'' కళ్ళు తెరిచి కెప్టెన్ వైపు చూశాడు.

''నా కొచ్చిన కల చిన్నదే అయినా చాలా అద్భుతమైంది. కలలో మనం ముగ్గురం నిద్రపోదామని పడుకున్నామట. మధ్యలో నాకు మెలుకువ వచ్చి చూస్తే మీ ఇద్దరూ నా పక్కన లేరట. ఒంటరిగా ఈ లైఫ్ బోట్‌లో, చుట్టూ సముద్రం, ఎదురుగా ఈ బ్రెడ్ ముక్క. పట్టరాని సంతోషంతో దాన్ని అందుకుని, తృప్తిగా తిని, వాటర్ బాగ్‌లో మిగిలిన కాసిని నీళ్ళు తాగి ప్రాణాలు నిల్పుకున్నానట'' చెప్పడం ముగించి ఇద్దరి వైపు చూశాడు కెప్టెన్ రవితేజ. ●

ఈ బహుమతి పొందిన రచనలలో మీకు నచ్చిన మినీ కథ వివరాలు దిగువ ఇచ్చిన కూపన్‌లో నింపి, పోస్ట్ కార్డుపై అంటించి మా కార్యాలయానికి పంపండి.

— ఎడిటర్

నాకు నచ్చిన కథ: ------------------------------

రచయిత/ రచయిత్రి: ------------------------------

పేజీ నంబరు: ------------------------------